ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు
జిల్లా వార్తలు
శనివారం 9 మార్చి 2024





శివోహం

హరహర మహదేవ.. శంభోశంకర నామస్మరణలతో శైవక్షేత్రాలు మార్మోగాయి. మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం వేకువజామునుంచే శివాలయాలకు భక్తులు తరలివచ్చారు. ఆయా క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆయా ఆలయాల వద్ద నిర్వాహకులు భక్తులు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఉత్సవర్లను గ్రామ..పురవీధుల్లో ఊరేగించారు.




దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు - ప్రత్యేక అలంకరణలో స్వామివారు

మొగిలిలో భక్తసందడి

మహావిష్ణు క్షేత్రపాలకుడిగా ఉన్న కామాక్షి సమేత మొగిలీశ్వర హరిహరక్షేత్రం మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం భక్తులతో సందడిగా మారింది. ఉదయం నుంచి భక్తులు పెద్దఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు. కాణిపాకం ఆలయ అధికారులు పట్టువస్త్రాలను తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు. ఆలయ ఈవో మునిరాజ, వంశపారంపర్య ధర్మకర్త విజయ్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. పలమనేరు డీఎస్పీ మహేశ్వరరెడ్డి, సీఐ లక్ష్మయ్య బందోబస్తు ఏర్పాట్లు చేశారు. - బంగారుపాళ్యం

చిత్తూరులోని రంగాచారి వీధి కాశీ విశ్వేశ్వరాలయంలో స్వామివారి అలంకరణ.. దర్శనం కోసం వచ్చిన భక్తులు - వెదురుకుప్పం మండలం డీఆర్ఎన్‌కండ్రిగలో కొండమల్లీశ్వరస్వామికి కాగడ హారతి



మూడు నియోజకవర్గాల దాహార్తి తీరుస్తామని ఒక డిప్యూటీ సీఎం, ఇద్దరు ఎమ్మెల్యేలు 'చామంతిపురం' ప్రాజెక్టును తెరపైకి తెచ్చారు. అధికారులతో సమీక్షలూ జరిపారు. ప్రతిపాదనలు పంపామని చెప్పారు. కానీ మూడున్నరేళ్లవుతున్నా అతీగతీలేదు.

ఇటీవల కుప్పం నియోజకవర్గంలో పర్యటించిన సీఎం జగన్.. అక్కడ రెండు రిజర్వాయర్లు నిర్మిస్తామని ప్రకటించారు. ఇప్పటికే ప్రజల చెవిలో 'చామంతి'పురం పెట్టిన ప్రభుత్వం.. ఎన్నికల వేళ కుప్పంలో మరో హామీ ఇచ్చింది. ఇలా మాటల్లోనే 'ప్రాజెక్టులు' చూపిస్తున్నారు. - చిత్తూరు, ఆంధ్రజ్యోతి

ప్రజల చెవిలో చామంతిపురం

- రూ.3 వేల కోట్లతో రిజర్వాయరు కడతామని ప్రకటన
- మూడున్నరేళ్లయినా ఊసే లేని వైనం
- కుప్పంలో రెండు ప్రాజెక్టులు నిర్మిస్తామన్న సీఎం మాటపై ప్రజల విస్మయం

'పూతలపట్టు మండలం చామంతిపురం వద్ద రూ.3 వేల కోట్లతో రిజర్వాయరు నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపండి. దీంతో చిత్తూరు నగరంతో పాటు పూతలపట్టు, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లో ప్రజల దాహార్తి తీరుతుంది' అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి 2020 అక్టోబరు 19న చిత్తూరు కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమై ఆదేశించారు. ఈ చామంతిపురం రిజర్వాయర్‌కు సంబంధించి డిప్యూటీ సీఎంతో పాటు చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్ బాబు కూడా పలుమార్లు హామీలిచ్చారు. ఐదు టీఎంసీల సామర్థ్యంతో నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. దీనికి ఉమ్మడి కడప జిల్లాలోని గండికోట రిజర్వాయర్ నుంచి పైపులైన్ల ద్వారా కృష్ణా జలాలు తెస్తామని ఎమ్మెల్యేలు చెప్పారు. లేదంటే అడవిపల్లె రిజర్వాయర్ నుంచి వచ్చే నీళ్లతోనైనా నింపుతామన్నారు. వాస్తవానికి జిల్లాలో ఒక్కటీ పెద్ద రిజర్వాయర్ లేదు. రైతులకు సాగు, ప్రజలకు తాగునీటి కష్టాలు తీర్చడానికి హంద్రీనీవా ప్రాజెక్టు ఒక్కటే శరణ్యం. అదీ కాలువలపైనే ఆధారపడింది. ఒక జలాశయం అందుబాటులో ఉంటే నీటిని నిల్వ చేసుకుని, ఎద్దడి పరిస్థితులను ఎదుర్కోవచ్చు. చామంతిపురం రిజర్వాయర్ నిర్మించాలనుకున్నచోటు పూతలపట్టు, ఐరాల మండలాల సరిహద్దులో ఉంది. అడవిపల్లె- ఎన్టీఆర్ రిజర్వాయర్ల మధ్య ఈ ప్రాంతం ఉన్నందున పూతలపట్టు, జీడీనెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాలకు ఉపయుక్తంగా మారుతుందని ఆయా ప్రాంతాల ప్రజలు భావించారు. ఇక, 2021 సెప్టెంబరు 23న సీఎం జగన్‌ను కలిసిన చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చామంతిపురం రిజర్వాయర్ ప్రతిపాదనలను నేరుగా అందించి, సహకరించాలని కోరారు. ఈ అంశాన్ని ముగ్గురు ప్రజాప్రతినిధులు గట్టిగా చెప్పడంతో ఎన్నికల నాటికి పూర్తవుతుందని ప్రజలు భావించినా ఫలితం లేకుండా పోయింది.

సర్వే కూడా చేయలేకపోయారు..

మూడున్నరేళ్లు పూర్తవుతున్నా చామంతిపురం రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి నయా పైసా నిధులు విడుదల కాలేదు. తట్ట మట్టి ఎత్త లేదు.అధికారులు పలుమార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఫలితం లేదు. ప్రాథమికంగా సర్వే చేయడానికి రూ.10 కోట్లవుతుందని యంత్రాంగం ఎమ్మెల్యేలకు సూచించగా, రూ.5 కోట్లు విడుదల చేయిస్తామని భరోసా ఇచ్చారు.

చామంతిపురం రిజర్వాయర్ లక్ష్యం

ఐదు టీఎంసీల సామర్థ్యంతో ఈ రిజర్వాయర్‌ను నిర్మించాలనుకున్నారు. ఇందులో నుంచి ఒక టీఎంసీ నీటిని చిత్తూరు నగరానికి కేటాయించి.. మరో నాలుగు టీఎంసీలతో పూతలపట్టు, జీడీనెల్లూరు నియోజకవర్గ ప్రజల దాహార్తి తీర్చవచ్చు. అలాగే పూతలపట్టు, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది.



కుప్పంలో 'రెండు' కడతారట!

టీడీపీ హయాంలో 87 శాతం పనులు పూర్తయిన హంద్రీనీవా కుప్పం బ్రాంచి కెనాల్‌ను ఈ ప్రభుత్వం నాలుగున్నరేళ్లుగా పట్టించుకోలేదు. ఎన్నికల ముందు తాము కుప్పానికి నీళ్లిచ్చామని చెప్పుకొనేందుకు మిగిలిన పనులను అరకొరగా చేశారు. ఇటీవల సీఎం జగన్ ఆ కాలువను ప్రారంభించారు. ఆ నీళ్లూ అంతంత మాత్రమే వచ్చాయి. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కుప్పంలోనే ఒక టీఎంసీ సామర్థ్యంతో రూ.535 కోట్లతో రెండు రిజర్వాయర్లను నిర్మిస్తామని హామీనిచ్చారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని గెలిపిస్తే వీటిని పూర్తి చేస్తామన్నారు. 'ఇప్పటి వరకు కుప్పం బ్రాంచి కాలువను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురాని.. చామంతిపురం రిజర్వాయరు ఊసెత్తని పాలకులు, కుప్పంలో రెండు రిజర్వాయర్లు నిర్మిస్తారా? ఎన్నికల స్టంటు కాకపోతే' అని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.



కానిస్టేబులును నిలదీస్తున్న మహిళ

మంత్రి వస్తే స్కూటర్లను పోలీసు స్టేషన్‌లో పెడతారా?

- రోడ్డుపై బైఠాయించి కానిస్టేబుల్‌ను నిలదీసిన మహిళా ఉద్యోగి

పుంగనూరు, మార్చి 8: మంత్రి వస్తారని, మా స్కూటర్‌ను పోలీసు స్టేషన్‌కు ఎలా తీసుకెళ్తారంటూ కానిస్టేబుల్‌ను మహిళా ఉద్యోగి నిలదీశారు. ఈ ఘటన శుక్రవారం పుంగనూరులో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మారెమ్మ గుడిలో పూజచేయించాలని ఓ మహిళా ప్రభుత్వ ఉద్యోగిని, వారి కుటుంబం ద్విచక్ర వాహనంలో వచ్చారు. రోడ్డు పక్కన వాహనాన్ని నిలిపి గుడిలోకి వెళ్లారు. మదనపల్లె రోడ్డులో నూతన జడ్పీ గెస్ట్‌హౌ‌స్‌ను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ప్రారంభించి పట్టణంలోకి వచ్చే కార్యక్రమం ఉంది. ఈ క్రమంలో మంత్రి వచ్చే మారెమ్మ గుడి ప్రాంతంలో రోడ్డు పక్కన ఉన్న ద్విచక్ర వాహనాలను పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. గుడి నుంచి బయటకు వచ్చిన మహిళా ఉద్యోగి తన ద్విచక్ర వాహనాన్ని గురించి విచారించగా పోలీసులుతీసుకెళ్లారని చెప్పడంతో అప్పుడే సోమేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి ఆ మార్గంలో వెళుతున్న బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్‌కు చెప్పాలని ఆమె ప్రయత్నించారు. రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న పోలీస్ కానిస్టేబుల్‌పై ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంత్రి వస్తే తమ స్కూటర్‌ను ఎలా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళుతారని, ఇదేక్కడి న్యాయం, శివరాత్రినాడు ఇలా చేయడమేంటని నిలదీస్తూ ఆయన వెంటపడి ఆగ్రహంతో ప్రశ్నించారు. వెంటనే పోలీసులు మీబండి ఇస్తాం రమ్మంటూ తీసుకెళ్లి స్కూటర్ ఇచ్చారు. ఈవివాదంతో కొంత సేపు ట్రాఫిక్ స్తంభించింది. ఈ వీడియో ఉదయం నుంచి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది.

ఏ 'స్థాయి' కావాలో మీరే చెప్పండి

ఎమ్మెల్యేగా వైసీపీలోకి వెళ్లా.. అదే పదవిలోనే టీడీపీకి వచ్చా

మంత్రి పెద్దిరెడ్డికి అమర్ కౌంటర్

పలమనేరు, మార్చి 8: 'మీరు ఎన్నిసార్ల ఎమ్మెల్యే అయ్యారో నేనూ అన్నిసార్లు అయ్యా. మీలాగే నేనూ మంత్రినయ్యా. 'స్థాయి' గురించి మాట్లాడాలంటే ఏ స్థాయి కావాలో మీరే చెప్పండి. ఇంకా స్థాయిల గురించి మాట్లాడాలంటే చాలా మాట్లాడాల్సి వస్తుంది. నా వ్యాపారాలన్నీ లీగలే. మీరు చేసే వ్యాపారాల గురించి పుంగనూరు బైపా‌స్‌ను తట్టి అడిగితే తెలుస్తుంది. ఏపీఐఐసీకి ఇచ్చిన భూములు ఎవరివో తెలుసుకొని మాట్లాడాలి' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఉద్దేశించి మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరులో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తనపై పెద్దిరెడ్డి చేసిన వ్యాఖ్యల గురించి స్పందించారు. ఆయనేదో తనను శాసన సభ్యుడ్ని చేసినట్లు, తన రాజకీయ ఎదుగుదలకు పునాది వేసినట్లు మాట్లాడటం అర్థంకాని విషయమన్నారు. తానేదో పార్టీ మారానని ఎవరికో ద్రోహం చేశానని మంత్రి మాట్లాడటం సరికాదన్నారు. 'నేను ఎమ్మెల్యేగానే టీడీపీ నుంచి వైసీపీకి పోయా. శాసన సభ్యుడిగానే టీడీపీలోకి వచ్చింది వాస్తవం. మీ నాయకుడు ఒక చెత్తనాయకుడని నాడు ఆ పార్టీ నుంచి వచ్చేశా' అని వ్యాఖ్యానించారు. 'పార్టీ ఫిరాయింపు గురించి మాట్లాడాల్సి వస్తే.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తొలుత ఉన్నది జనతాపార్టీలో. అక్కడ ఓడిపోతూంటే కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే, మంత్రి అయ్యారు. తర్వాత వైసీపీలో మీరెందుకు చేరారు? జగన్ తండ్రి కాంగ్రెస్‌లో ఉన్నారు. ఆ కాంగ్రెస్‌ను జగన్‌రెడ్డి ఎందుకు వదిలి వైసీపీని పెట్టారో మీరు సమాధానం చెబుతారా' అని పెద్దిరెడ్డిని అమర్ ప్రశ్నించారు. మీరెంత అభివృద్ధి చేశారో పుంగనూరు వెళ్లి చూస్తే అర్థమవుతుందన్నారు. మీవద్ద రాజకీయాలు నేర్చుకోవాల్సిన అవసరం తనకు లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో పెద్దిరెడ్డి కుటుంబంలోని ముగ్గురూ ఓడిపోతారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పి.విజయబాబు జోస్యం చెప్పారు. పలమనేరు ప్రభుత్వాస్పత్రిని 50 నుంచి 100 పడకలకు పెంచి నూతన భవనాలకోసం టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రతిపాదనలు పంపితే నాబార్డు రూ.16కోట్లు మంజూరు చేసిందని ఆ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ బాలాజి నాయుడు తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి

టీడీపీలోకి మాజీ ఎమ్మెల్యే ఏఎస్!

- నేడు ఆత్మీయుల సమావేశం

చిత్తూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్ శనివారం టీడీపీలో చేరనున్నట్లు తెలిసింది. ఈ మేరకు ఆత్మీయులతో సమావేశం నిర్వహించి ఆయన ప్రకటన చేయనున్నట్లు సమాచారం. టీడీపీ నుంచి రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టిన ఆయన నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పోటీచేశారు. 1994, 1999, ఎన్నికల్లో ఓటమిచెందగా, 2004లో గెలుపొందారు. 2009లో టీడీపీ టికెట్ ఇవ్వలేదని, 2012లో వైసీపీలో చేరారు. 2014 ఎన్నికల్లో వైసీపీ నుంచీ టికెట్ రాకపోవడంతో రాజకీయాలకు దూరంగా ఉన్నారు. 2019 ఎన్నికల్లో రాజంపేట పార్లమెంటు స్థానం నుంచి సత్యప్రభ పోటీ చేయడంతో, ఎన్నికలకు 20 రోజుల ముందు ఏఎస్ మనోహర్‌కు చిత్తూరు టీడీపీ టికెట్ లభించింది. 2019 ఎన్నికల్లో ఓటమిచెందారు. వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ జిల్లా నాయకులు ఈయన వ్యాపారాలను ఇబ్బంది పెట్టడంతో టీడీపీకి దూరంగా ఉంటానని ప్రకటించారు. అలా క్రియాశీల రాజకీయాలకు దూరమైన ఆయన.. గతేడాది డిసెంబరులో ఆత్మీయుల సమావేశాన్ని నిర్వహించి టీడీపీలో చేరేందుకు మొగ్గు చూపారు. ఈ మధ్య మాజీ మంత్రులు సి.రామచంద్రయ్య, నారాయణను కలిసి రాజకీయ భవిష్యత్తుపై చర్చించారు. దీనికి తోడు శుక్రవారం చంద్రబాబు ఫోనుచేసి గురజాల మద్దతిచ్చి గెలిపించుకుని రావాలని చెప్పారు. ఈ క్రమంలో శనివారం ఆత్మీయుల సమావేశాన్ని నిర్వహించి టీడీపీలో చేరేందుకు సిద్ధమైనట్లు ఆయన అనుయాయులు తెలిపారు. కాగా, వైసీపీకి వ్యతిరేకంగా ఒక్కొక్కరుగా నాయకులు టీడీపీ వైపు అడుగులేస్తున్నారు.

గంజాయి ముఠా అరెస్టు



నిందితులు, గంజాయిని మీడియాకు చూపిస్తున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

చిత్తూరు, మార్చి 8: గంజాయిని విక్రయిస్తున్న ఓ ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ వివరాలను సీఐ ఉలసయ్య, ఎస్‌బీ డీఎస్పీ సుధాకర్‌రెడ్డిలతో కలిసి డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం మీడియాకు వివరించారు. ఆయన తెలిపిన ప్రకారం.. నగరంలోని రాజుగుడి వెనుక భాగంలో గంజాయి అమ్ముతున్నారని రెండో పట్టణ పోలీసులకు సమాచారం వచ్చింది. దాంతో దాడులు నిర్వహించగా తేనబండకు చెందిన అరవింద్(23), సంతపేటకు చెందిన రవితేజ(20)ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 2.50లక్షల విలువైన ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడైన ఆటో రవి పరారయ్యాడని, త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు.

29మంది ఎండీయూ వాహన ఆపరేటర్లకు జీతాల నిలుపుదల

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 8: ఇళ్లకు రేషన్ సరుకుల పంపిణీలో నిర్లక్ష్యం చూపిన 29 మంది ఎండీయూ వాహన ఆపరేటర్లకు జీతాలు నిలుపుదల చేస్తూ జిల్లా పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ప్రతి నెలా 1-17 తేదీల మధ్య నిత్యవసర వస్తువులు అందజేస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికీ రూ.18వేలు, వారి సహాయకులకు రూ.3 వేలు వంతున ప్రభుత్వం చెల్లిస్తోంది. కాగా ఫిబ్రవరి నెలలో కార్డుదారులకు నిత్యవసర వస్తువులు సక్రమంగా అందించని కారణంగా 29మంది జీతాలను ఈనెలలో నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఎస్వో శంకరన్ తెలిపారు.

తిరుమలకు అలిపిరి నడక దారిలో అక్రమ దుకాణాలు వెలుస్తున్నాయి. ఎకో డెవలప్‌మెంట్ కమిటీ పేరిట ప్రభుత్వ అటవీ శాఖ అనుమతులు జారీ చేస్తుండగా దుకాణాల ఏర్పాటుకు ఓ బడా మంత్రి అనుచరులు రంగంలోకి దిగుతున్నారు.అసలే వ్యాపారాలు తగ్గాయని వాపోతున్న టీటీడీ లైసెన్సుడు దుకాణదారులు వీరిని అడ్డుకుంటున్నారు. ఫలితంగా ఆందోళనలు, ఘర్షణలు తలెత్తుతున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



కొద్దిరోజుల క్రితం కాలినడకమార్గంలో ఏర్పాటైన మరో దుకాణం

అలిపిరి నడక దారిలో అక్రమ షాపులు!

ఎకో డెవలప్‌మెంట్ కమిటీ పేరిట ప్రభుత్వ అటవీ శాఖ అనుమతులు

షాపుల ఏర్పాటుకు రంగంలోకి దిగిన బడా మంత్రి అనుచరులు

అడ్డుకుంటున్న టీటీడీ లైసెన్సుడ్ షాపుల నిర్వాహకులు

అలిపిరి మెట్ల దారిలో ఇప్పటి వరకూ టీటీడీ, దేవాదాయ శాఖలు మాత్రమే దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇస్తున్నాయి.ఏడవ మైలు వద్ద మాత్రమే రెండు హోటళ్ళకు అటవీ శాఖ అనుమతులు ఇచ్చింది.అద్దెలు విపరీతంగా పెరిగిపోవడం, దానికి తగిన వ్యాపారం జరగక ఆ రెండు హోటళ్ళూ ఎప్పుడో మూతపడ్డాయి. తర్వాత వేలం పాటల్లో ఎవరూ పాల్గొనకపోవడంతో హోటళ్ళు తెరుచుకోలేదు. అలాంటిది ఇపుడు ఏకంగా 30 షాపులకు అనుమతులు జారీ చేసింది. 2397వ మెట్టు వద్ద, చిట్టిక్కుడు వద్ద హిమాచల్ ప్రదేశ్ దుకాణం ఎదుట, 7వ మైలు ప్రాంతంలో 2400వ మెట్టు, 35వ మలుపులో 2403, 2410, 2415వ మెట్ల వద్ద, 2425వ మెట్టు, జింకలపార్కు సమీపాన 2542వ మెట్టు వద్ద, 2450వ మెట్టు వద్ద, జింకల పార్కు పరిధి 2550వ మెట్టు వద్ద, 2597వ మెట్టు, 2610వ మెట్టు, 2625వ మెట్టు, 2655వ మెట్టు, జింకల పార్కు మండప సమీపాన 2660 మెట్టు, 7వ మైలు ప్రాంతంలోని మండపం దగ్గర 2687వ మెట్టు, 2726వ మెట్టు, 2735వ మెట్టు, దొరసాని మండపం సమీపాన 2760వ మెట్టు, దొంగల మండపం సమీపాన 2796వ మెట్టు, అటవీ శాఖ సరిహద్దు లైను సమీపాన 2814వ మెట్టు, 2815వ మెట్టు, 2825వ మెట్టు, వ్యూ పాయింట్ సమీపాన 2832వ మెట్టు, ఎన్ఎస్ టెంపుల్ సమీపాన 2851, 2866వ మెట్ల వద్ద, కొత్త మండపం సమీపాన 2931వ మెట్టు, 7వ మైలు మండపం వద్ద రెండు, 7వ మైలు మ్యూజియం వద్ద ఒకటి చొప్పున మొత్తం 30 షాపులకు అటవీ శాఖ అనుమతి ఇచ్చింది.వీటితో కొందరు అర్ధరాత్రిళ్ళు స్తంభాలు నాటి ఇనుప రేకులతో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసేందుకు యత్నిస్తున్నారు. ఈ ప్రయత్నాలు జింకలపార్కు, ఏడవ మైలు ప్రాంతాల్లో ఉద్రిక్తతలకు కారణమవుతున్నాయి. ఇప్పటికే అక్కడ టీటీడీ నుంచీ లైసెన్సు పొందిన వ్యాపారులు దుకాణాలు నిర్వహిస్తున్నారు. వీరికి గతంలో తిరుమలలో లేపాక్షి నుంచీ సీఆర్వో వరకూ సబ్‌వేలో దుకాణాలుండేవి. అయితే అక్కడ వ్యాపారం జరగకపోవడంతో లక్కీ డిప్ ద్వారా అలిపిరి నడక దారిలో టీటీడీ దుకాణాలు కేటాయించింది . అయితే అక్కడ కూడా వ్యాపారాలు పెద్దగా సాగడం లేదు. కాలినడక భక్తులకు ఉచిత దర్శన టోకెన్లు అలిపిరిలోనే జారీ చేస్తుండడంతో నడక దారిలో వెళ్ళే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది. దీంతో ఆ దారిలో వ్యాపారాలూ తగ్గాయి. దానికి తోడు చిన్నారులపై చిరుత పులులు దాడులు జరపడంతో అటవీ శాఖ అధికారులు తినుబండారాల విక్రయాలు వద్దని ఒత్తిడి పెంచారు. నడకదారి భక్తుల సంఖ్యా తగ్గింది. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో వున్న లైసెన్సుడు దుకాణదారులకు అటవీ శాఖ ద్వారా దొడ్డిదారిన షాపుల ఏర్పాటుకు కొందరు ప్రయత్నించడం కడుపు రగిలేలా చేస్తోంది. గత పదిరోజుల్లో పలు మార్లు కొత్త వ్యక్తులు దుకాణాల ఏర్పాటుకు యత్నించడం పాత దుకాణదారులు వాటిని కూల్చేయడం జరుగుతోంది. తాజాగా గురువారం కూడా కొత్తవ్యక్తులు కూలీలను పెట్టి దుకాణాలు ఏర్పాటు చేస్తుండగా పాత వ్యాపారులు వాటిని అడ్డుకుని కూల్చివేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే అక్కడ ఘర్షణలు కూడా తలెత్తే ప్రమాదం కనిపిస్తోంది.



ఏడవమైలు వద్ద నిర్మించిన దుకాణాన్ని తొలగిస్తున్న పాత దుకాణదారులు

ఎవరీ షాపులు దక్కించుకున్నవారు?

అలిపిరి నడక దారిలో 30 షాపులు ఎకో డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుల పేరిట కేటాయింపులు జరిగాయి. బి.సుబ్రమణ్యం రెడ్డి, బి.శోభారాణి, ఎం.చంద్రబాబు, ఎన్.కృష్ణయ్య, ఎం.చంద్రశేఖర్, కె.వినోద్‌కుమార్, ఆర్.దీపిక, ఎన్.జయమ్మ, పి.హంస, ఎం.బాబు, సౌందర్య, జి.విజయ, సి.పద్మరాణి, ఎం.సుబ్రమణ్యం, ఆర్.నరసింహులు, వై.రాజశేఖర్, కె.లక్ష్మీదేవి, వై.హరిబాబు, సి.నాగరాజ, సి.మునిరాజ, బి.రేఖ, జి.చెంచెలక్ష్మి, వై.అనసూయమ్మ, వై.చండీప్రియ, వి.మదన మోహన్‌రెడ్డి, వి.వెంకటేశ్వర్లు, ఎం.పుష్పవేణి, వి.కృష్ణప్రసాద్‌రెడ్డి, డి.వెంకటేశులు పేర్లతో షాపులకు అనుమతులు జారీ అయ్యాయి. అసలు వీరంతా ఎవరో, ఎక్కడి వారో, వీరు ఎకో డెవలప్‌మెంట్ కమిటీలో సభ్యులుగా ఎలా చేరారో పరిశీలించాల్సి వుంది. వీరంతా సదరు మంత్రి అనుచరులన్న ప్రచారం వుంది.వీరెవరికీ టీటీడీ నుంచీ అనుమతులు లేకపోయినా దుకాణాలు ఏర్పాటు చేసుకుంటూండడం గమనార్హం.

తాము వద్దన్న పనిని తామే చేస్తున్న అటవీశాఖ

అలిపిరి నడక దారిలో చిన్నారులపై చిరుత పులులు దాడులు చేయడంపై అధ్యయనం జరిపిన వైల్డ్ లైఫ్ అటవీ శాఖ ఉన్నతాధికారులు పలు అంశాలను గుర్తించారు. నడక దారి పొడవునా దుకాణాల్లో తిను బండారాలు విక్రయిస్తుంటారు. గతంలో జింకల పార్కు వున్నందున జింకలకు పాదచారులు తినుబండారాలు అలవాటు చేశారు. వాటికోసం జింకలు గుమిగూడేవి. అవి తినగా మిగిలే వ్యర్థాలను, నడక దారి భక్తులు పడేసే వ్యర్థాలు, దుకాణాల్లో మిగిలిపోయిన ఆహార పదార్థాల వ్యర్థాలు కూడా అక్కడే పోగుపడుతున్నాయి. ఈ వ్యర్థాల కోసం ఎలుగుబంట్లు రావడం మొదలైంది. మరోవైపు జింకల కోసం చిరుత పులులు మాటేయడానికి అలవాటు పడ్డాయి. కాలక్రమంలో జింకల పార్కు ఎత్తేసినా అలవాటు పడిపోయిన జింకలన్నీ ఆ ప్రాంతంలోనే ఎక్కువగా సంచరిస్తున్నాయి. ఈ కారణంగానే చిరుతలు మెట్ల దారి వద్దకు వచ్చి మాటేయడం, అందుబాటులో చిన్నారులు కనిపించినపుడు దాడి చేసి లాక్కెళ్ళడం జరుగుతోంది. అటవీ శాఖ ఉన్నతాధికారుల పరిశీలనలో ఇదే అంశాన్ని గుర్తించి ఆ ప్రాంతంలో తినుబండారాలు విక్రయించే దుకాణాలు ఎత్తివేయాలని సిఫారసు చేశారు.అదే అటవీ శాఖే ఇపుడు తినుబండారాల దుకాణాల ఏర్పాటుకు అనుమతులివ్వడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.పైగా 7వ మైలు ప్రాంతంలో దుకాణాల ఏర్పాటుకు అనుమతివ్వడమే నిబంధనలకు విరుద్ధమన్న వాదన వినిపిస్తుండగా దానికి ఎంచుకున్న మార్గం కూడా మరింత అక్రమంగా కనిపిస్తోంది. తిరుపతి జిల్లా అటవీ శాఖాధికారి జి.సతీష్ దీనిపై గతేడాది నవంబరు 10వ తేదీన టీటీడీ ఈవోకు రాసిన లేఖలో అలిపిరి నడక దారిలోని 7వ మైలు ప్రాంతంలో ఎకో డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు తమ జీవనోపాధి కోసం తాత్కాలిక దుకాణాలు నడుపుతున్నారంటూ వాటి వివరాలు పేర్కొన్నారు. ఆ లేఖలోనే ఈ తాత్కాలిక దుకాణాలు 2018 నుంచీ నడుస్తున్నట్టు పేర్కొన్నారు. వాస్తవానికి అధికారికంగా అయినా అనధికారికంగా అయినా నడక దారిలో అటవీ శాఖకు దుకాణాలే లేవని సమాచారం. 7వ మైలు వద్ద కేవలం రెండు దుకాణాలు మాత్రమే వుండేవని అవి కూడా పదిహేనేళ్ళ కిందట మూతపడ్డాయని సమాచారం. అయినా 2018 నుంచీ 30 తాత్కాలిక దుకాణాలు నడుస్తున్నాయని బాధ్యత కలిగిన జిల్లాస్థాయి అధికారి టీటీడీకి నివేదించడం విమర్శలకు దారి తీస్తోంది.

తెర వెనుక అసలు సంగతేమిటంటే...


టీటీడీ వ్యవహారాల్లో ముఖ్యంగా కొండపైన అధికార పార్టీకి చెందిన ఇద్దరు కీలక నేతల నడుమ ఆరు నెలలుగా ఆధిపత్య పోరు సాగుతోంది. తన అనుచరులకు మేలు చేసేలా దుకాణాల ఏర్పాటు వంటి వాటికి ఓ బడా మంత్రి చేస్తున్న సిఫారసులను టీటీడీ బుట్టదాఖలా చేస్తోందని సమాచారం. దర్శనాలు మినహా మిగిలిన పాలనా వ్యవహారాల్లో, లబ్ధి కలిగే ఏ అంశంలోనూ మంత్రి మాట చెల్లుబాటు కావడం లేదని వైసీపీ వర్గాల్లోనూ, టీటీడీ వర్గాల్లోనూ ప్రచారమవుతోంది. ఈ పరిణామాలతో ఆగ్రహించిన మంత్రి తనకున్న పలుకుబడి వినియోగించారని, దాంతో తిరుమలలో తన పరిధి కలిగివున్న ప్రభుత్వ అటవీ శాఖ తెర మీదకు వచ్చిందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అలిపిరి, శ్రీవారి మెట్టు నడక దారుల్లో కొన్ని ప్రాంతాలు, అలాగే కొండపైన పాపనాశనం వంటి చోట్ల కొన్ని ప్రాంతాలు ప్రభుత్వ అటవీ శాఖ పరిధిలో వున్నాయి. పాపనాశనం వద్ద ఆ శాఖ అనుమతితో ఎప్పటి నుంచో దుకాణాలు నడుస్తున్నాయి. గతంలో 7వ మైలు వద్ద రెండు దుకాణాలు ఆ శాఖ అనుమతితో నడిచేవి.వ్యాపారం జరగక మూతపడ్డాక వాటిని పునరుద్ధరించలేదు.ఈ నేపథ్యంలో మంత్రి ఒత్తిడితోనే అటవీ శాఖ అధికారులు 2018నుంచీ ఎకో డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులైన 30మందికి తాత్కాలిక దుకాణాలు నడక దారిలో వున్నట్టు నిర్ధారించి టీటీడీ ఈవోకు లేఖ రాయడం వివాదాస్పదంగా మారుతోంది.

టీటీడీ భద్రత, పర్యవేక్షణ ఏమైందో శ్రీవారికెరుక!

టీటీడీ భద్రత, పర్యవేక్షణల్లో లోపాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. తాజాగా అలిపిరి నడక దారిలో కొత్త దుకాణాల ఏర్పాటుకు జరుగుతున్న యత్నాలే దానికి నిదర్శనం. అలిపిరి చెక్ పాయింట్ నుంచీ కొండపైదాకా ఇటు నడక దారిలోనూ, అటు ఘాట్ రోడ్లలోనూ, కొండపైనా ఎక్కడ చీమ చిటుక్కుమన్నా టీటీడీకి తెలియాలి. దానికి తగ్గ భద్రతా, నిఘా వ్యవస్థ దేవస్థానానికి వుంది. అయితే అలిపిరి నడక దారిలో పట్టపగలు, అలాగే అర్ధరాత్రిళ్ళు తాత్కాలిక దుకాణాలు ఏర్పాటవుతున్నా టీటీడీకి తెలియకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. దుకాణాల ఏర్పాటుకు నిర్మాణ సామగ్రి టీటీడీ భద్రతా, నిఘా వ్యవస్థల కంట పడకుండా 7వ మైలు దాకా ఎలా చేరుతోందన్నది ప్రశ్న. అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తుంటే నిరంతరం నడక దారిపై నిఘా వేసి వుంచే విజిలెన్స్ యంత్రాంగానికి ఎందుకు తెలియడం లేదన్నది మరో ప్రశ్న. చివరికి అక్కడ పాత దుకాణదారులకు, కొత్తగా వస్తున్న వారికి గొడవలు జరుగుతున్నా కూడా టీటీడీ అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది.మంత్రి ఒత్తిడితో సంబంధిత వ్యవస్థ చూసీచూడనట్టు వ్యవహరిస్తోందని భావించాల్సివస్తోంది.

శంభో.. శివశంభో..!

● ముక్కంటి క్షేత్రంలో భక్తజనసందోహం



నంది, సింహ వాహనాలపై ఆదిదంపతుల విహారం

శ్రీకాళహస్తి, మార్చి 8: శ్రీకాళహస్తిలోని ముక్కంటి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం ఉదయం భక్తులు పలుచగా కన్పించినా 11గంటలనుంచీ మొదలైన రద్దీ రాత్రి వరకూ కొనసాగింది.అప్పుడప్పుడూ తోపులాటలు కూడా జరిగాయి. స్వర్ణముఖి నదిలో పుణ్యస్నానాలు.. పితృదేవతలకు తర్పణాలు జోరుగా సాగాయి. శివరాత్రిని పురస్కరించుకుని వాయులింగేశ్వరుడు నిజమూర్తి రూపంలో దర్శనమిచ్చారు. సుప్రభాత సేవ తరువాత 3 గంటల నుంచీ భక్తులను దర్శనానికి అనుమతించారు. రుద్రాభిషేకంతో పాటు పచ్చకర్పూరాభిషేకం, పంచామృతాభిషేకాలతో స్వామివారు నిత్యాభిషేక మూర్తిగా దర్శనమిచ్చారు. జ్ఞానప్రసూనాంబిక దేవికి కూడా వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. కాగా, శ్రీకాళహస్తీశ్వరుడి నందిసేవ శుక్రవారం రాత్రి నయనోత్సవంగా సాగింది.శివరాత్రి జాగరణ చేసే భక్తుల కోసం ఆదిమధ్యాంత రహితుడైన సర్వేశ్వరుడు తనకు ఎంతో పీత్రికరమైన నందిపై దివ్య దర్శనమిచ్చారు. ఊరేగింపును తిలకించేందుకు... జాగరణ చేసి మొక్కులు తీర్చుకునేందుకు తరలివచ్చిన భక్తులతో శ్రీకాళహస్తీశ్వరాలయం, మాడవీధులు కిక్కిరిసిపోయాయి. జ్ఞానప్రసూనాంబా దేవి సింహవాహనాన్ని అధిరోహించి అనుసరించారు. ఉదయం శ్రీకాళహస్తీశ్వరుడు ఇంద్ర విమానంపై, జ్ఞానప్రసూనాంబదేవి చప్పరంపై అధిరోహించి పురవిహారం చేశారు.

అదుపుతప్పిన ద్విచక్ర వాహనం

కుమారుడు దుర్మరణం - తండ్రి పరిస్థితి విషమం



సర్వేష్ మృతదేహం - శీనప్ప

రామకుప్పం, మార్చి 8: ఆరిమానిపెంట-వీర్నమల రహదారిలో ద్విచక్రవాహనం అదుపుతప్పిన ప్రమాదంలో కుమారుడు అక్కడికక్కడే మృతి చెందగా, తండ్రి తీవ్రగాయాలతో ఆసుపత్రి పాలయ్యాడు. స్థానికుల కథనం మేరకు... మండల పరిధి పంద్యాలమడుగు పంచాయతీ కావలిమడుగుకు చెందిన శీనప్ప(50), అతడి కుమారుడు సర్వేష్(23) శుక్రవారం సాయంత్రం వీర్నమలలోని బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. మార్గమధ్యంలో ఆరిమానిపెంట-వీర్నమల రహదారి నల్లరాళ్ళచేను క్రాస్ వద్ద వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పింది. దీంతో వాహనం నడుపుతున్న సర్వేష్, వెనుక కూర్చున్న శీనప్ప తారురోడ్డుపై పడిపోయారు. సర్వేష్‌కు తలపై తీవ్రగాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. శీనప్ప తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు 108 వాహనం ద్వారా శీనప్పను కుప్పం ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని, సర్వేష్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల వేళ..మరో ఏడాది

●శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొనసాగింపు

● కొంతమందిని తొలగించి...మరి కొందరికి అవకాశం

శ్రీకాళహస్తి, మార్చి 8: శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి పాలనా కాలాన్ని మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పాలక మండలి చైర్మన్‌గా అంజూరు శ్రీనివాసులు కొనసాగగా పలువురు సభ్యులను తొలగించి కొత్తవారికి అవకాశం కల్పించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో వుంచుకుని ప్రధానంగా పట్టణంలో బీసీ, బలిజ కులాల ఓట్లను ఆకర్షించేలా బోర్డులో పలువురు సభ్యులకు అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది.ఎమ్మెల్యే మధుకు అనుకూలంగా ఉన్న వారందరికీ బోర్డులో తిరిగి స్థానం దక్కగా కొత్తగా ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ దివంగత శ్రీరామమూర్తి అన్న కొండుగారి కృష్ణకుమార్‌కు అవకాశం కల్పించారు. అలాగే నాయీ బ్రాహ్మణులకు సంబంధించి ఆవులపాటి శ్రీనివాసులు, అరుణామెడికల్స్ అధినేత సుబ్బరామగుప్తాకు చోటు కల్పించారు. గతంలో ఉన్న ముగ్గురిని తొలగించి ప్రత్యేక ఆహ్వానితులుగా తొమ్మిదిమందిని నియమించారు. వీరిలో గతంలో టీడీపీలో మాజీ కౌన్సిలరుగా ఉన్న కంఠా ఉదయ్‌కుమార్‌కు ప్రత్యేక ఆహ్వానితులుగా అవకాశం ఇచ్చారు.ట్రస్ట్‌బోర్డులో ఈసారి అవకాశం వస్తుందని ఆశించిన పలువురికి నిరాశే మిగిలింది. ఆర్థికంగా ఉన్నవారికే బోర్డులో పదవులు ఇవ్వడంపై అధికార పార్టీలోనూ అసంతృప్తి వ్యక్తం అవుతోంది. కాగా ఈ మండలికి శివరాత్రి బాగా కలిసొచ్చింది.రెండేళ్ల క్రితం ఫిబ్రవరి 28న అర్ధరాత్రి ముక్కంటి ఆలయానికి ధర్మకర్తల మండలిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పక్కరోజు మార్చి 1న అంజూరు శ్రీనివాసులు చైర్మన్‌గా మండలి ప్రమాణస్వీకారం చేసింది. సరిగ్గా మళ్లీ శుక్రవారం శివరాత్రి రోజున మండలిలో మార్పులు, చేర్పులతో ఏడాది కాలం పొడిగిస్తూ జీవో వెలువడింది. గతంలో లాగే అదే తరహాలో శివరాత్రి రోజున సాయంత్రం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ప్రమాణస్వీకారం జరిగింది.

కలకలం రేపిన సూసైడ్ సెల్ఫీ వీడియో

పోలీసుల అప్రమత్తతతో యువకుడు క్షేమం



నిరంజన్‌ను కుటుంబసభ్యులకు అప్పచెబుతున్న పోలీసులు

వెంకటగిరి, మార్చి 8:తిరుపతి జిల్లా వెంకటగిరి మండల పరిధిలోని వెలుగొండల్లో వున్న కోనమల్లేశ్వర స్వామి కోనకు వెళ్లే అటవీ ప్రాంతంలో ఓ యువకుడు నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకొంటున్నట్లు సెల్ఫీ వీడి యో తీసి కుటుంబ సభ్యులకు పంపి కలకలం సృష్టించాడు. వెంకటగిరి పోలీసుల కథనం మేరకు... చౌడేపల్లె మండలంలోని దుర్గసముద్రం గ్రామానికి చెందిన నిరంజన్ గురువారం కోనమల్లేశ్వరస్వామి కోన అటవీ ప్రాంతానికి చేరుకున్నాడు. అక్కడ ఓ కొండపై కూర్చొని నిద్రమాత్రలు మింగుతూ సెల్ఫీ వీడియో తీసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు కుటుంబ సభ్యులకు వీడియోను వాట్సప్ ద్వారా పంపాడు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే చిత్తూరు పోలీసులు వెంకటగిరి పోలీసులకు సమాచారం ఇచ్చి అప్రమత్తం చేశారు. వెంకటగిరి ఎస్ఐ సుధాకరరెడ్డి హుటాహుటిన సిబ్బందిని వెంటబెట్టుకొని కోన మల్లేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే అటవీ మార్గానికి చేరుకొన్నారు. నిద్రమాత్రలు మింగి మత్తులోకి జారుకున్న నిరంజన్‌ను జీపులో ఎక్కించుకుని వెంకటగిరి తీసుకువచ్చారు. నిద్రమాత్రల మోతాదు తక్కువగా వుండడంతో ప్రాణాపాయం లేదని పోలీసులు తెలిపారు. ఇంట్లో గొడవ పడి వచ్చి ఆత్మహత్యకు యత్నించానని ఆ యువకుడు చెప్పాడు. శుక్రవారం అతడిని కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు.

'ఖజానా' శాఖలో సెలవుల్లేవ్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 8: మార్చి నెల వచ్చిందంటే ఖజానా ఉద్యోగులకు సెలవుల్లేనట్లే. పండుగ సెలవులైనా, ఆదివారాలైనా విధులకు రావాల్సిందే. ఆర్థిక సంవత్సరానికి చివరి నెల కావడంతో.. మార్చిలో 31 రోజులూ వీరు పనిచేయాల్సిందే. ఇంకా ఉదయం, సాయంత్రం ఒక్కో గంట అదనంగా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా ఖజానాతో పాటు చిత్తూరు, బంగారుపాళ్యం, పలమనేరు, పుంగనూరు, కుప్పం, నగరి ఉపఖజానా శాఖలన్నీ పనిచేస్తున్నాయి. ఆర్థిక పరమైన, ఆర్థికేతర బిల్లులన్నీ మార్చి నెలలోనే పాసవుతుంటాయి. అందుకని ప్రతిరోజూ వచ్చే బిల్లులను వీరు ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి, పాస్ చేస్తూ సీఎఫ్ఎంఎస్‌కు పంపాల్సి ఉంటుంది. తాజాగా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల బిల్లులు రావడం ఎక్కువయ్యాయి. వీటిని రాత్రివేళల్లోనూ ఖజానా ఉద్యోగులు వెంటనే పరిశీలించి, పాస్ చేసి, బ్యాంకులకు పంపే ప్రక్రియ కొనసాగిస్తున్నారు.

శ్రీవారి సన్నిధికి దూరమై... మనసు భారమై

తిరుమల ఆలయ మహాద్వారం ముంగిట విలపించిన టీటీడీ ఉద్యోగి





తిరుపతి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అది తిరుమల శ్రీవారి ఆలయ ప్రవేశ మార్గం... శుక్రవారం ఉదయం సుమారు 11 గంటల వేళ... ఆలయం నుంచీ అర్చకుడిలా వున్న ఓ వ్యక్తి విషణ్ణ వదనంతో వెలుపలికి వచ్చారు... మహద్వారం ముంగిట సాష్టాంగ ప్రమాణం చేశారు... ఆపై లేచి నుంచుని పట్టరాని దుఃఖంతో అక్కడి నుంచీ నిష్క్రమించారు... ధారాపాతంగా కారుతున్న కన్నీటిని ఉత్తరీయంతో తుడుచుకుంటూ సాగిపోతున్న ఆయన్ను చూసి మీడియా ప్రతినిధులు ఏమి జరిగిందంటూ ప్రశ్నించినా సమాధానం చెప్పకుండా చేతులెత్తి నమస్కరించారు. ఏడుస్తూనే వీడియో తీయొద్దని వారిస్తూ ముందుకు సాగిపోయారు. శ్రీవారి ఆలయం నుంచీ విలపిస్తూ నిష్క్రమించిన ఆయన ఎవరా అని ఆరా తీస్తే బదిలీ కారణంగా భారమైన మనసుతో శ్రీవారి సన్నిధికి దూరమైన ఉద్యోగి గురురాజారావు అని తెలిసింది. టీటీడీలో 2002వ సంవత్సరం గురురాజారావు టెంపుల్ ఇన్స్‌పెక్టర్ హోదాలో ఆలయ విధుల్లో చేరారు. ఆపై బొక్కసం క్లర్కుగా తర్వాత బొక్కసం సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందారు. టీటీడీలో బొక్కసం సూపరింటెండెంట్ అన్న ఉద్యోగం కీలకమైనదే కాక సంక్లిష్టమైంది కూడా. ఆలయంలో శ్రీవారి బంగారు, వెండి ఆభరణాలన్నీ ఆయన ఆధీనంలోనే, పర్యవేక్షణలోనే వుంటాయి. శ్రీవారి మూల మూర్తికి అలంకరించే ఆభరణాలు, ఉత్సవ మూర్తులకు అలంకరించే నగలు కూడా ఆయనే బొక్కసం నుంచీ ఎంపిక చేసి తీసుకెళ్ళి ప్రధాన అర్చకులకు అప్పగించడం, వాటిని తొలగించాక తిరిగి బొక్కసానికి చేర్చి భద్రపరచడం ఆయన ప్రధాన విధి. ఈ విధుల్లో భాగంగా ఆలయంలో రోజువారీ స్వామివారికి జరిగే నిత్య కైంకర్యాలపైన, పూజలు, ప్రత్యేక పూజా పునస్కారాలమీద ఆయనకు విశేషమైన అనుభవం కూడా వుంది. నిత్యం అర్చకులకు సహకరించే క్రమంలో ఆయనకు రోజువారీ ఆలయంలో శ్రీవారి పూజా కైంకర్యాల గురించి సమగ్ర అవగాహన తెచ్చుకున్నారు. దానికి తోడు డాలర్ శేషాద్రి మరణించే వరకూ ఆయన వెన్నంటి వుండి శ్రీవారి దర్శనార్థమై వచ్చే మఠాధిపతులకు, పీఠాధిపతులకు కూడా ప్రీతిపాత్రుడయ్యారని సమాచారం. ఆలయ వ్యవహారాల్లో ఇటు అర్చకులకు, అటు అధికారులకు నడుమ సంధానకర్తగా వ్యవహరిస్తూ ఆలయ నిర్వహణలో కీలక వ్యక్తిగా మారారు. గత 20 ఏళ్ళలో టీటీడీలో పనిచేసిన ఉన్నతాధికారులందరి వద్దా మన్ననలు పొందారు.విధి నిర్వహణలో ఎలాంటి ఆరోపణలు, ఫిర్యాదులు కూడా లేవని, వివాద రహితుడిగా పేరు పడ్డారని తెలిసింది. అయితే ఆ క్రమంలో కొంతమంది అధికారుల ఈగో కారణంగా బొక్కసం సూపరింటెండెంట్ విధులకు దూరమైనట్టు తెలిసింది. 2020లో ఆయన్ను బొక్కసం సూపరింటెండెంట్‌గా తప్పించి తిరుమలలోనే వైభవోత్సవ మండపానికి బదిలీ చేశారు. శ్రీవారి బంగారం, వెండి ఆభరణాలు పర్యవేక్షించే బాధ్యతల నుంచీ తప్పించినా కనీసం తిరుమలలోనే విధులు కేటాయించినందుకు సంతోషిస్తూ అక్కడే విధుల్లో కొనసాగారు. అయితే బొక్కసం విధుల నుంచీ తప్పించడంతో సంతృప్తి చెందని కొందరు అధికారులు కక్షసాధింపుతో ఆయన్ను తాజాగా తిరుమల నుంచే బదిలీ చేయించారని సమాచారం. తిరుపతి టీటీడీ పరిపాలనా భవనంలోని అకౌంట్స్ విభాగానికి బదిలీ చేసినట్టు తెలిసింది. 22 ఏళ్ళుగా తిరుమలలో శ్రీవారి సన్నిధిలో గడిపిన ఆయన బదిలీ కారణంగా తిరుమల వీడాల్సి రావడంతో హతాశులయ్యారని సమాచారం. దీంతో శుక్రవారం విచార వదనంతో ఆలయం వీడిన ఆయన మహద్వారం ముంగిట శ్రీవారికి ప్రణమిల్లి కన్నీరు కారుస్తూ వైభవోత్సవ మండపం వైపు వెళ్ళిపోవడం చూపరులను కలచివేసింది. శ్రీవారి పట్ల, ఆలయ విధుల పట్ల ఆయనకున్న భక్తిప్రపత్తులు అక్కడున్న వారి మనసులను కదిలించింది.

మద్యపాన నిషేధం అంటే పేదల రక్తం తాగడమా?

ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



సోన్నేగానిపల్లెలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తదితరులు

శాంతిపురం, మార్చి 8 : మద్యపాన నిషేధం అంటే పేదల రక్తం తాగడమా అని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం శాంతిపురం మండలంలోని సోన్నేగానిపల్లె లో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ మద్యపాన నిషేధం ఏమైందని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ప్రశ్నించారు. నాణ్యత లేని మందు అమ్మి పేదల రక్తాన్ని జలగలాగా జగన్ తాగేస్తున్నారన్నారు. కుప్పం టీడీపీ ఇంచార్జి పీఎస్ మునిరత్నం మాట్లాడుతూ గ్రామాల్లో పర్యటిస్తున్నప్పుడు ప్రజల ఆదరణ చూస్తుంటే టీడీపీ గెలుపు ఖాయమన్నారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే సూపర్ 6 పథకాలు ప్రతి ఒక్కరికి అందిస్తామని ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం మండల నేతలు సోన్నేగానిపల్లె, గుండిశెట్టిపల్లె, కూతేగానిపల్లె, నాయనపల్లె గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలను పంచారు. కార్యక్రమంలో మండల టీడీపీ నేతలు పుష్పవతి, మంజునాథ్‌రెడ్డి, మునెప్ప గౌడు, నాగభూషణం, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, ఉదయకుమార్, విజయ రామిరెడ్డి, చంద్రశేఖర్, బాలు, ఆర్ఎస్ మణి, నారాయణస్వామి, ఎల్.జయరామిరెడ్డి, రమేష్‌రెడ్డి, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రావాలని ప్రార్థనలు



రామకుప్పం, మార్చి 8: రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావాలని, కుప్పం నుంచి చంద్రబాబు లక్ష మెజారిటీతో గెలుపొందాలని కోరుతూ బందార్లపల్లె పంచాయతీ గెర్నిపల్లెలోని ముస్లింలతో కలసి ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మైనారిటీ విభాగం జిల్లాకార్యదర్శి సలాంసాబ్‌లు స్థానిక మసీదులో ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటా ప్రచారం చేసి, సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే బల్ల గ్రామంలోని మసీదులో స్థానిక ముస్లింలతో కలిసి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ కుప్పం ఇన్‌చార్జి మునిరత్నం, పరిశీలకుడు గాజులఖాదర్‌బాషా చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావాలని ప్రార్థనలు చేశారు.

టీడీపీలో చేరిన గుండ్లసాగరం యువత



కుప్పం, మార్చి 8: గుడుపల్లె మండలం గుండ్లసాగరం గ్రామానికి చెందిన యువత చాలామంది శుక్రవారం కుప్పం టీడీపీ కార్యాలయానికి వచ్చి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను కలిశారు. ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గం ఇంతగా అభివృద్ధి చెందినంటే అది కేవలం చంద్రబాబు చలవేనన్నారు. అందువల్ల తొలిసారిగా ఓటుహక్కు పొందిన తాము, ఆయనకు తప్ప మరొకరికి ఓటేయబోమని ప్రతినబూనారు. టీడీపీ నాయకులు రాజు, చంద్రశేఖర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గరిగచీనేపల్లెలో టీడీపీ ఎన్నికల ప్రచారం

కుప్పం రూరల్, మార్చి 8: కుప్పం మండలంలోని గరిగచీనేపల్లె గ్రామ పంచాయతీలో శుక్రవారం వన్నెకుల క్షత్రియ యువత, కులపెద్దలు టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సాంబశివం, వన్నెకుల క్షత్రియ నియోజకవర్గ అధ్యక్షుడు డి.సతీశ్, కుమార్, ప్రధాన కార్యదర్శి రామమూర్తి, నియోజకవర్గ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ రాజశేఖర్, ఈశ్వర్, చంద్ర, నరసింహులు, వి.సురేశ్, గణేశ్‌కుమార్, వినోద్ కుమార్, వంశీ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ అతిథి గృహం ప్రారంభం



పుంగనూరు, మార్చి 8: స్థానిక ట్రావెలర్స్ బంగ్లాలో నూతనంగా నిర్మించిన జడ్పీ అతిథి గృహాన్ని శుక్రవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి మాట్లాడుతూ పట్టణంలో రోడ్డు సుందరీకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి 146 మంది రైతులకు వ్యవసాయ భూముల పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీ ఎన్.రెడ్డెప్ప, పంచాయతీ రాజ్ ఎస్ఈ చంద్రశేఖర్, జడ్పీ సీఈవో గ్లోరియా, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ ప్రభాకర్‌రెడ్డి, పీఆర్ డీఈ చంద్రశేఖర్, జనపదకళల సంస్థ రాష్ట్ర చైర్మన్ నాగభూషణం, ముడా చైర్మన్ వెంకటరెడ్డియాదవ్, బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజరెడ్డి, ఏఎంసీ చైర్మన్ అమరనాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ శివయ్య, ఎంపీడీవో మునిరెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం



వి.కోట, మార్చి 8: వి.కోట వ్యవసాయ మార్కెట్ ఎదురుగా ఉన్న డీఆర్‌కే భవంతిలోని నాల్గవ అంతస్తు నుంచి ఒక్కసారిగా మంటలు ఎగసి పడ్డాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా శుక్రవారం మధ్యాహ్నం పైఅంతస్తు లోంచి మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.2లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

శివాలయానికి ఉత్సవ విగ్రహాల వితరణ



రొంపిచెర్ల, మార్చి 8: రొంపిచెర్ల సమీపంలోని శివాలయానికి గ్రామంలోని బజారువీధికి చెందిన వ్యాపారవేత్త శ్రీవల్లి శ్రీనివాస కుమారులు 40 కిలోల పంచలోహ విగ్రహాలను వితరణగా శుక్రవారం ఇచ్చారు. విగ్రహాలను పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చారు. శనివారం ఉత్సవవిగ్రహాలకు కల్యాణోత్సవం నిర్వహిస్తారు. అనంతరం పల్లకి సేవలో ఊరేగింపుగా తీసుకెళతామని దాతలు తెలిపారు.

చెరకు, మామిడి తోట దగ్ధం

శ్రీరంగరాజపురం, మార్చి 8: పొదలపల్లె గ్రామానికి చెందిన రైతు మురగయ్యకు చెందిన 5 ఎకరాల చెరకుతోట, సుమారు 250 మామిడి చెట్లు కాలిపోయాయి. గుర్తు తెలియని వ్యక్తులు అడవికి నిప్పు పెట్టడంతో నిప్పురవ్వలె ఎగసి చెరకుతోటపై పడ్డాయి. తోట పూర్తిగా దగ్ధమైంది. పక్కనే ఉన్న మామిడి తోటకు అంటుకోవడంతో సుమారు 250 మామిడి చెట్లు కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికి తోట పూర్తిగా కలిపోయింది. సుమారు రూ.10లక్షల వరకు ఆస్తి నష్టం వచ్చిదని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు వేడుకుంటున్నాడు.

భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు



కుప్పం మండలంలో మల్లప్పకొండపై మల్లేశ్వరస్వామి, తీర్థం-కోట్రేపల్లె కాళభైరేశ్వరస్వామి, మృత్యుంజయేశ్వరస్వామి ఉత్సవమూర్తుల, పలమనేరు కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తులు, ఆది యోగీశ్వరుడు

పలమనేరు, మార్చి8 : మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం శివాలయాలు భక్తుల శివనామస్మరణలతో మార్మోగాయి.పలమనేరులోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, బసవేశ్వరస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తులు శివకోటి ప్రారంభించారు. పలమనేరు మండలం టి.ఒడ్డూరు సమీపంలో వెలసిన ఆదియోగీశ్వరస్వామి ఆలయంలో శివకోటి నిర్వహించారు. రాత్రి భక్తుల రద్దీ మరింత పెరిగింది.

బైరెడ్డిపల్లె : తీర్థం-కోట్రేపల్లె కాళభైరేశ్వరస్వామి ఆలయంలో ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠ, కలశస్థాపన జరిగింది. అర్చకులు స్వామికి అభిషేకంచేసి గిరిజా కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవదొడ్డి, కోట్రేపల్లె గ్రామస్తులు, బెంగళూరు వెంకట్రాయశెట్టి కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. బైరెడ్డిపల్లెలోవున్న బాటగంగమ్మ ఆలయంలో అమ్మవారికి అభిషేకం, విశేషపూజలు నిర్వహించారు.

చౌడేపల్లె : స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం, గోసల కురప్పల్లెలో కాశీవిశ్వేశ్వర ఆలయం, ఎర్రప్పల్లెలో బసవేశ్వరస్వామి ఆలయం, పుదిపట్లలో పంచలింగేశ్వర్లు ఆలయం, లద్దిగంలో నీలకంఠేశ్వర ఆలయాలలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

కుప్పం రూరల్ : కుప్పం మండలంలో మల్లప్పకొండపై వెలసిన మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి విశేషాలంకరణ చేశారు. భక్తులు తండోపతండాలుగా స్వామివారిని దర్శించుకున్నారు.

శాంతిపురం : జంగాలపల్లె వీరభద్రస్వామి దేవాలయంలో తోమాలసేవ ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లోని శివాలయాల్లో పూజలు చేశారు.

గుడుపల్లె : స్వర్ణగిరి మల్లప్పకొండపై ఉన్న మల్లేశ్వర స్వామికి వేదపండితులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మల్లేశ్వరుడు, పార్వతి ఉత్సవమూర్తులను ఊరేగించారు. గుడివంకలోని గంగాధరేశ్వరస్వామి దేవాలయం, కాడేపల్లెలోని శివాలయం, దాసుమానుపల్లెలోని మల్లేశ్వరుడుకి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

రామకుప్పం : పట్టణంలోని అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో, విజలాపురంలోని అంగనాథేశ్వరస్వామి ఆలయాల్లో దేవతామూర్తులకు అభిషేకపూజలు చేశారు. రామకుప్పంలోని కాశీవిశ్వేశ్వరాలయంలో వేదపండితులు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు.

సదుం: మండల పరిధిలోని కన్నెమూల మహాగణపతి ఆలయంలో నాగప్రతిష్ఠ, శివపార్వతుల కల్యాణోత్సవం, సదుం గార్గేయ నది ఒడ్డున వెలసిన సుబ్రహ్మణ్య స్వామి ఆలయం, మరకత శివలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో మూడు అడుగుల బంగారు పూతతో శివలింగాన్ని ఏర్పాటు చేసి విశేష పూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. స్థానిక అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో రాత్రి జాగరణ చేసే భక్తుల కోసం కోలాటాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు.

రొంపిచెర్ల: రొంపిచెర్ల మండలంలోని సిద్ధేశ్వర స్వామి, పెద్దగొట్టిగల్లు పంచాయతీలోని జ్ఞానాంబిక ఓంకారేశ్వరస్వామి, మోటుమల్లెల పంచాయతీ పాలెం నగిరిలో కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అలాగే రొంపిచెర్లలోని సిద్ధేశ్వరస్వామి ఆలయానికి మాఘ మాస దీక్షతులతో పాటు పలు గ్రామాల నుంచి భక్తులు పోటెత్తారు.

సోమల : దుర్గంకొండకు సోమల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడంతో భక్తుల సందడిగా మారాయి. ఇరికిపెంట పంచాయతీ మధురమలై కొండలోని మల్లేశ్వరస్వామి ఆలయం, దుర్గం కొండ గార్గేయ మునీశ్వరస్వామి ఆలయం, మల్లేశ్వరపురంలోని మల్లేశ్వరాలయం, చెరుకువారిపల్లె అర్ధనారీశ్వరస్వామి, పెద్దఉప్పరపల్లె, , రాశెట్టివారిపల్లె, సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. రాత్రి శివకోటి జపయజ్ఞ, వీధి నాటక ప్రదర్శనలు నిర్వహించారు.

వి.కోట : పట్టణంలో వెలసిన కాశీవిశ్వేశ్వర స్వామికి అభిషేకాలు, విశేష అలంకరణ చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో మునిరత్నం దాసు నేతృత్వంలో శివ పురాణం హరికథ వినిపించారు. రాత్రికి పార్వతీ, పరమేశ్వరుల ఉత్సవమూర్తులను పల్లకిపై కొలువు తీర్చి ఆలయ కమిటీ వారు పురవీధుల్లో ఊరేగించారు.

పుంగనూరు రూరల్ : పుంగనూరు భోగనంజుండేశ్వరస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి, సోమేశ్వరస్వామి, అఘోర వీరభద్రస్వామి, రాగానిపల్లె మార్గంలోని పరమేశ్వరస్వామి, భీమగానిపల్లె, చదళ్ల గ్రామాల్లోని శివాలయాల్లో అర్చకులు స్వామివార్లకు రుద్రాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. నెక్కొందిలో వెలసిన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం, గజవాహనోత్సం నిర్వహించారు.



స్వర్ణగిరి మల్లప్పకొండలో మల్లేశ్వరుడు, రామకుప్పంలో అన్నపూర్ణదేవి-కాశీవిశ్వేశ్వరస్వామి, జంగంపల్లె కాశీవిశ్వేశ్వర స్వామి, మల్లేశ్వరపురంలో మల్లేశ్వరుడు, సోమేశ్వరస్వామి, రొంపిచెర్లలో సిద్దేశ్వరుడు

మహిళా చైతన్యంతోనే సమాజాభివృద్ధి



విలక్షణమైన రంగోలి ఎదుట కేఈసీ విద్యార్థినులు, గంగవరంలో సన్మానం అందుకున్న మహిళలు

కుప్పం, మార్చి 8: మహిళలే సమాజ నిర్మాతలని, మహిళలు చైతన్యవంతులైనప్పుడే సమాజ అభివృద్ధి చెందుతుందని కుప్పం పీఈఎస్ ఆసుపత్రి మానసిక రుగ్మతల వైద్యురాలు డాక్టర్ ఆర్.శ్రీలత అన్నారు. కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటు కుటుంబాన్ని, అటు ఉద్యోగాన్ని సమానంగా నిర్వహిస్తూ, రేపటి సమాజానికి దిశానిర్దేశం చేస్తున్న గొప్ప వ్యక్తిగా మహిళను పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు రంగోలీ, స్కిట్, మ్యూజికల్ చైర్, ఫ్యాషన్ షో తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల యాజమాన్య ప్రతినిధులు, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సోమల : మండలంలోని ఇరికిపెంట పంచాయతీలో గ్రామస్తులు అంగన్‌వాడీ కార్యకర్తలను, మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. స్త్రీ శక్తి భవనంలో పలువురు డ్వాక్రాగ్రూపు సభ్యులను ఏపీఎం శివయ్య సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో శివరత్న, ఉపాధ్యాయులు లత తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు : కల్లూరు వీఆర్ఆర్ కళాశాలలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా లయన్స్ క్లబ్ క్రీడావిభాగం అధ్యక్షులు మహమ్మదాలీ మాట్లాడుతూ మహిళలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలన్నారు. అనంతరం అధ్యాపకురాళ్లు మహేశ్వరి, శశికళ, లక్ష్మి, నసీబాను దుశ్శాలువాతో సన్మానించి బహుమతులు అందజేశారు.

పుంగనూరు రూరల్ : స్థానిక స్త్రీశక్తి భవన్ జరిగిన కార్యక్రమంలో ఏపీఎం రవి మాట్లాడుతూ సమాజాభివృద్ధికి మహిళల సేవలు ఎంతో అవసరమని కొనియాడారు. అనంతరం మహిళలకు బహుమతులు అందజేశారు. సమావేశంలో సీసీలు, సంఘమిత్రలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం : స్థానిక కళామందిరంలో తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో మహిళా సదస్సు నిర్వహించారు. సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడే కుటుంబాలు అన్నివిధాలా అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం వివిధ రంగాల్లో విశిష్ఠ సేవలందిస్తున్న సాయిలీల, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రజని, డాక్టర్ మాధవి, డాక్టర్ సౌమ్య, గీతాకుమారి, లక్ష్మీసుధ, మల్లెల్ల జానకి, మాధవీదేవి, సరస్వతి, గాయత్రీదేవి, హేమశ్రీ, ప్రణమ్య, సుమ, వల్లి, సులోచన, గాయత్రి, భరణి, చిన్ని సురేఖ, మాధవిలను సన్మానించి పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ధనంజయ, లయన్స్‌క్లబ్ రఘుపతి, ఉమామహేశ్వరరెడ్డి, వాణి, సౌమిత, విజయ్, హర్షిత, చంద్రశేఖరయ్య, సీతారామయ్య, మంజునాథ్ పాల్గొన్నారు.



మేటిమందలో టీచర్లకు సన్మానం, కల్లూరు వీఆర్ఆర్ కళాశాలలో మహిళా అధ్యాపకులకు బహుమతులు

వీరభద్రుడికి గణపయ్య పట్టువస్త్రాలు



ఐరాల, మార్చి8: గార్గేయ నదీ తీరాన మతంపల్లెలో వెలసిన భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో గురువారం మహాశివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించారు. కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం తరపున ఎంపీపీ మోహన్, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ ధర్మకర్త ధనచంద్రారెడ్డి, పూజారి మోహన్‌రెడి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన ఆలయంలో ఉదయం వీరభద్ర స్వామికి అభిషేకం నిర్వహించారు. మహాశివలింగానికి రుద్రాభిషేకం చేశారు.

కాణిపాక ఆలయానికి రూ.లక్ష విరాళం



ఐరాల(కాణిపాకం), మార్చి 8: కాణిపాకం ఆలయ అభివృద్ధికి అమెరికాలో ఉంటున్న ఎన్ఆర్ఐ దేవరపల్లె మల్లికార్జునరెడ్డి గురువారం రూ.లక్ష విరాళంగా డీడీ రూపంలో అందించారు. దాతకు చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు ఆలయ మర్యాదలతో స్వామి దర్శనం కల్పించారు. వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

మైనార్టీలను నిలువునా ముంచిన సీఎం జగన్

● శాసనమండలి మాజీ చైర్మన్ అహమ్మద్ షరీఫ్



పార్టీలో చేరుతున్న వైసీపీ నేతలు

చిత్తూరు సిటీ, మార్చి8 : సీఎం జగన్ ముస్లిం మైనార్టీలను నిలువునా ముంచారని శాసన మండలి మాజీ చైర్మన్ యం.అహమ్మద్ షరీఫ్ ఆరోపించారు. శుక్రవారం స్థానిక విజయదుర్గ కళ్యాణ మండపంలో ముస్లిం మైనార్టీలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన అనేక పథకాలను వైసీపీ రద్దుచేసి మైనార్టీలను మోసం చేసిందన్నారు. చిత్తూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి టీడీపీ పెద్దపీట వేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు చంద్రప్రకాష్, కటారి హేమలత, అశోక్ ఆనంద్ యాదవ్, నౌషాద్, ఫైరోజ్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ లేకపోతే గమనం లేదు : ఏఎస్పీ

చిత్తూరు, మార్చి 8: స్త్రీ లేకపోతే గమనం, జననం, జీవం, సృష్టి లేదని ఏఎస్పీ అరీఫుల్లా అన్నారు. శుక్రవారం ఏఆర్ పోలీసు కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించి వంద మంది మహిళలకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మహిళలచే కేక్‌కట్ చేయించారు. దిశ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ మహబూబ్‌బాషా, ఆర్ఐ నీలకంఠేశ్వర్‌రెడ్డి, సీఐలు విశ్వనాథరెడ్డి, ఉలసయ్య, రవిశంకర్‌రెడ్డి, కుల్లాయప్ప, లక్ష్మణన్, మనోహర్, బాలయ్య పాల్గొన్నారు.

పలమనేరు ఏజీపీగా కృష్ణమూర్తి



పలమనేరు, మార్చి8 : పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు నూతన ప్రభుత్వ సహ న్యాయవాదిగా జల్లిపేట గ్రామానికి చెందిన జి.కృష్ణమూర్తిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. మూడేళ్లపాటు ప్రభుత్వం తరపున సివిల్ కేసుల్లో విధులు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఏజీపీగా నియమితులైన కృష్ణమూర్తి గత 17ఏళ్లుగా పలమనేరు కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నారు.

ఘనంగా గిరిజా కల్యాణం



కల్లూరు, మార్చి 8: పులిచెర్ల మండలంలోని శైవక్షేత్రాలు శుక్రవారం మహా శివరాత్రి సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. కల్లూరు చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో సాయంత్రం కన్నులపండువగా గిరిజా కల్యాణోత్సవం నిర్వహించారు. అన్నదానం నిర్వహించారు.

కందూరులో ఇళ్ల పట్టాల పంపిణీ

సోమల, మార్చి 8: కందూరు పంచాయతీలోని సచివాలయంలో ఇంటి రిజిస్ట్రేషన్ చేసుకున్న లబ్ధిదారులకు పట్టాలను ఎంపీపీ ఈశ్వరయ్య పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచు బాషా మసూద్, కార్యదర్శి జయశంకర్, నాగేంద్ర, శివ, కిరణ్, మెకానిక్ బాషా పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బైరెడ్డిపల్లె, మార్చి 8 : కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 5వతరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శోభ ఒకప్రకటనలో తెలిపారు. ఈనెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశపరీక్ష ఏప్రిల్ 25న జిల్లా కేంద్రంలో జరుగుతుందన్నారు. అలాగే పాఠశాలలో 6, 8 తరగతుల్లో వున్న ఖాళీలను కూడా భర్తీ చేస్తామన్నారు.

కీరదోస తోటకు నిప్పు

పుంగనూరు రూరల్, మార్చి8: మండలంలోని భీమగానిపల్లె, కమతంపల్లె సమీపంలో నీలగిరితోట, కీరదోస తోటలకు శుక్రవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టినట్లు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు తెలిపారు. సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి మంటలను అదుపు చేసేలోపు దాదాపు రూ. 25వేలు నష్టం జరిగినట్లు వివరించారు.

తండ్రి జ్ఞాపకార్థం ఉచిత వాటర్ ప్లాంట్ ప్రారంభం



చౌడేపల్లె, మార్చి8: శెట్టిపేట పంచాయతీ ఎర్రప్పల్లెకు చెందిన సింగిల్ విండో మాజీ చైర్మన్ మునస్వామిరాజు జ్ఞాపకార్థం ఆతడి కుమారుడు మురళిరాజు రూ..3లక్షల విలువచేసే మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రజల సౌకర్యార్థం ఉచితంగా ఏర్పాటు చేశారు. శుక్రవారం వాటర్ ప్లాంట్‌ను దాతలు మురళిరాజు, సుబ్రహ్మణ్యంరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మునస్వామిరాజు కుటుంబీకులు హేమంత్‌రాజు, హేమసాగర్‌రాజు, కనకమ్మ,గీత,దివ్య, హేమలత, చందన తదితరులు పాల్గొన్నారు.

థామస్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలి


కరపత్రాలను పంపిణీ చేస్తున్న నేతలు

శ్రీరంగరాజపురం, మార్చి 8: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గంగాధర నెల్లూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు కోరారు. శుక్రవారం ఎస్‌ఆర్‌పురం గ్రామంలో టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి, సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లోకనాథం, దేవరాజులునాయుడు, దేవేంద్ర, జయచంద్ర, సిద్ధయ్యశెట్టి, రవి, బాబు నాయుడు, మహబూబ్ బాషా, నిరంజన్‌రెడ్డి, దొడ్డ హేమాద్రి యాదవ్, బల్లల రవి, పుల్లూరు బాబు తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రుడికి గణపయ్య పట్టువస్త్రాలు



ఐరాల, మార్చి8: గార్గేయ నదీ తీరాన మఠంపల్లెలో వెలసిన భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయలో మహాశివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించారు. కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం తరపున ఎంపీపీ మోహన్, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ ధర్మకర్త ధనచంద్రారెడ్డి, పూజారి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన ఆలయంలో వీరభద్ర స్వామికి అభిషేకం నిర్వహించారు. మహాశివలింగానికి రుద్రాభిషేకం చేశారు. ● కాణిపాకంలో వరసిద్ధుడి ఆలయానికి అనుబంధ ఆలయమైన మణికంఠేశ్వర స్వామి ఆలయం, కుళ్లంపల్లెలోని భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయానికి వరసిద్ధుడి ఆలయం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. ● నాంపల్లెలోని పుష్పవనేశ్వర స్వామి ఆలయం, పొలకల సంతగేటులోని కాలభైరవేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి పూజలు నిర్వహించారు. కుళ్లంపల్లెలో దక్ష యాగం జరిపించారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

వెదురుకుప్పం, మార్చి 8: మహా శివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని శివాల యాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. డీఆర్ఎన్ కండ్రిగ సమీపంలో ఉన్న అరుణగిరి క్షేత్రంలో జ్ఞాన ప్రసూనాంబ కొండ మల్లీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త డాక్టర్ కృష్ణమోహన్, ప్రసూనరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో విఘ్నేశ్వరపూజ, ధ్వజారోహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ● బ్రాహ్మణపల్లె -మొండివెంగనపల్లె సమీపంలో ఉన్న స్వయంభు సిద్ధేశ్వరస్వామి ఆలయంలో, తిరుమలయ్యపల్లె లోని బండెమ్మ కొమరెడ్డయ్య ఆవుదేవర నందీశ్వరాలయంలో, ఎగువ చవట గుంటలోని ఆవుదేవర నందీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చవట గుంటలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఆలయాల్లో భక్తులకు అన్నదానాలు చేశారు.

కమనీయం..కల్యాణోత్సవం

ఎగువ కన్నికాపురం గ్రామ సమీపంలో ఉన్న మరకతవల్లీ సమేత స్వయంభు సిద్ధేశ్వరస్వామి ఆలయంలో రుద్రహోమం, రుద్రాభిషేకం, శివ లలితా సహస్రనామ పూజలు నిర్వహించారు. అనంతరం మరకతవల్లీ సమేత స్వయంభు సిద్ధేశ్వరస్వామికి కల్యాణోత్సవం నిర్వహించారు.


ఎగువ కన్నికాపురంలో కల్యాణోత్సవం

చెరకు, మామిడి తోటల దగ్ధం



శ్రీరంగరాజపురం, మార్చి 8: పొదలపల్లె గ్రామానికి చెందిన రైతు మురగయ్యకు చెందిన 5 ఎకరాల చెరుకుతోట, సుమారు 250 మామిడి చెట్లు కాలిపోయాయి. గుర్తు తెలియని వ్యక్తులు అడవికి నిప్పు పెట్టడంతో నిప్పు రవ్వలె ఎగసి చెరకుతోటపై పడ్డాయి. తోట పూర్తిగా దగ్ధమైంది. పక్కనే ఉన్న మామిడి తోటకు అంటుకోవడంతో సుమారు 250 మామిడి చెట్లు కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికి తోట పూర్తిగా కలిపోయింది. సుమారు రూ.10లక్షల వరకు ఆస్తి నష్టం వచ్చిదని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు వేడుకుంటున్నాడు.

మైనార్టీలను నిలువునా ముంచిన జగన్

● శాసనమండలి మాజీ చైర్మన్ అహమ్మద్ షరీఫ్


అహమ్మద్ షరీఫ్ సమక్షంలో పార్టీలో చేరుతున్న వైసీపీ నాయకులు

చిత్తూరు సిటీ, మార్చి8 : సీఎం జగన్ ముస్లిం మైనార్టీలను నిలువునా ముంచారని శాసనమండలి మాజీ చైర్మన్ యం.అహమ్మద్ షరీఫ్ ఆరోపించారు. శుక్రవారం స్థానిక విజయదుర్గ కళ్యాణ మండపంలో ముస్లిం మైనార్టీలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన అనేక పథకాలను వైసీపీ రద్దుచేసి మైనార్టీలను మోసం చేసిందన్నారు. చిత్తూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి టీడీపీ పెద్దపీట వేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు చంద్రప్రకాష్, కటారి హేమలత, అశోక్ ఆనంద్ యాదవ్, నౌషాద్, ఫైరోజ్, జాఫర్, అత్తుబాయ్, నవాజ్, గౌస్, జిలాని, అన్సర్ తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి'

చిత్తూరు, మార్చి 8: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వ్యక్తిగత విమర్శలు మాను కోవాలని పలువురు కార్పొరేటర్లు కోరారు. శుక్రవారం వీఎస్ఆర్ కార్యాలయంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు జ్ఞాన జగదీశ్, వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రాజారెడ్డి, వైసీపీ మహిళా నేత గాయత్రిదేవిలతో పాటు పలువురు కార్పొరేటర్లు మాట్లాడారు. వైసీపీ రెడ్ల పార్టీ అని ఎమ్మెల్యే అంటున్నారని తెలియజేశారు. అయితే రెండు సార్లు ఆయనకు ఎవరు సీటు ఇచ్చారని ప్రశ్నించారు. నలుగురు కార్పొరేటర్లు, ఇద్దరు సర్పంచ్‌లను తీసుకెళ్లి జనసేనలో చేరారని, చేరిన వారంతా ఎమ్మెల్యే బంధువులే అన్నారు. ఇకపై వైసీపీని విమర్శిస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు.

పూరిల్లు దగ్ధం

వెదురు కుప్పం, మార్చి8 : వెదురు కుప్పం మండలం బొమ్మయ్య పల్లె పంచాయతీ తోటానం పల్లెకు చెందిన శివయ్య పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పాక్షికంగా శుక్రవారం కాలి పో యింది. స్థానికులు మంటలు ఆర్పడంతో నష్టం తీవ్రత తగ్గింది. రూ.30వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. విషయం తెలుసుకున్న టీడీపీ ఎన్ఆర్ఐ నియోజకవర్గ కో- ఆర్డినేటర్ గురుసాల కిషన్ చంద్ బాధితుడికి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. ఆయనవెంట రెడ్డికుమార్, నాగార్జున్, మాతయ్య, రామయ్య, లక్ష్మయ్య ఉన్నారు.


ఆర్థికసాయం అందిస్తున్న గురుసాల కిషన్ చంద్

స్నేహమంటే ఇదే..!



వెదురుకుప్పం, మార్చి 8: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి స్నేహితులు ఆసరాగా నిలిచారు. స్నేహమంటు ఇదేనని నిరూపించారు. వెదురుకుప్పం మండలం తాళ్లబయలు గ్రామానికి చెందిన కేశవులురెడ్డి(38) ఈ నెల 3వ తేదీన ఎస్‌ఆర్‌పురం మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. పదో తరగతిలో ఆయనతో పాటు చదివిన కొందరు స్నేహితులు శుక్రవారం ఆ గ్రామానికి చేరుకున్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తమ వంతు సాయంగా రూ.లక్ష ఆర్థికసాయం అందించారు.

కాణిపాక ఆలయానికి రూ.లక్ష విరాళం


డీడీని అందిస్తున్న దాత మల్లికార్జునరెడ్డి

ఐరాల(కాణిపాకం), మార్చి 8: కాణిపాకం ఆలయ అభివృద్ధికి అమెరికాలో ఉంటున్న ఎన్ఆర్ఐ దేవరపల్లె మల్లికార్జున రెడ్డి గురువారం రూ.లక్ష విరాళంగా డీడీ రూపంలో అందించారు. దాతకు చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు ఆలయ మర్యాదలతో స్వామి దర్శనం కల్పించారు. వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నగరి, మార్చి8: నగరిలోని తన కార్యాలయంలో మంత్రి రోజా ఏడుగురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం రూ.39 లక్షలు అందించారు. లివర్ వ్యాధితో బాధపడుతున్న రుద్రాక్షికి రూ.22 లక్షలు, మాధవరంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఆశీర్వాదం కుటుంబానికి రూ.5లక్షలు, చెరువులో పడి చనిపోయిన కుమార్ కుటుంబానికి రూ.3లక్షలు , మరో నలుగురికి కూడా చెక్కులను పంపిణీ చేశారు.

శివయ్యకు విశేషపూజలు


శివాలయంలో భానుప్రకాష్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు

నగరి, మార్చి8: నగరి మండల పరిధిలో బుగ్గదేవాలయం, గుండ్రాజకుప్పం దేవాలయం, పట్టణంలోని ఈశ్వర ఆలయం కీలపట్టులోని చంద్రమౌళీశ్వర స్వామి ఆలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కీలపట్టు ఆలయంలో మంత్రి రోజా, నగరి, గుండ్రాజకుప్పం ఆలయాల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పూజలు చేశారు. భక్తులకు అన్ని ఆలయాల్లో అన్నదానం చేశారు.

ఘనంగా బ్రహ్మంగారి కల్యాణోత్సవం

గుడిపాల, మార్చి 8: మండలంలోని 197 రామాపురంలో కొలువైన వీరబ్రహ్మంగారి గుడిలో శుక్రవారం శివరాత్రి సందర్భంగా వీరబ్రహ్మంగారి కల్యాణోత్స వాన్ని గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఆనంద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు. గొల్లపల్లి గ్రామానికి చెందిన అత్తిగారిగుట్టలో వెలసిన కాశీలింగేశ్వర శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు చేశారు.


అత్తిగారిగుట్టలో శివలింగానికి అభిషేకం

శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఏర్పాటుకు విరాళం

చిత్తూరు సిటీ, మార్చి 8: శ్రీకృష్ణదేవరాయలు విగ్రహ ప్రతిష్ఠకు చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి రూ.30 లక్షలు విరాళం ఇవ్వడం సంతోషంగా ఉందని బలిజ సంఘం నేత రవినాయుడు అన్నారు. శుక్రవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. బలిజసంఘం నేతలు నందగోపాల్, మధు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేత చవటగుంట

వెదురుకుప్పం, మార్చి 8: మండలంలోని అయ్యన్నగారిపల్లె సమీపంలో నెహ్రూ యువ కేంద్రం, అమ్మ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంటులో 12 జట్లు పాల్గొన్నాయి. చవటగుంట జట్టు విజేతగా, అయ్యన్నగారిపల్లె జట్టు రన్నర్స్‌గా నిలిచాయని నిర్వాహకులు విజయ్, జాకబ్, నరేశ్, వెంకటేశు తెలిపారు.

టీడీపీతోనే మహిళా సాధికారత


గురజాల సతీమణి ప్రతిమని సన్మానిస్తున్న తెలుగుమహిళలు

చిత్తూరు సిటీ, మార్చి 8 : టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యమని తెలుగుమహిళ జిల్లా అధ్యక్షురాలు కార్జాల అరుణ అన్నారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్జాల అరుణ మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీయార్ మహిళలకు ఆస్తి హక్కులో సమాన హక్కు కల్పించారన్నారు. మాజీ మేయర్ కటారి హేమలత మాట్లాడుతూ మహిళలకు రాజకీయాల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించింది టీడీపీనే అని పేర్కొన్నారు. టీడీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ సతీమణి పవిత్ర మాట్లాడుతూ చంద్రబాబు మానసపుత్రిక డ్వాక్రా గ్రూపుల ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడ్డారని తెలియ జేశారు. రాష్ట్ర తెలుగుమహిళ ఉపాధ్యక్షురాలు వైవీ.రాజేశ్వరి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, ఏడాదికి ఉచితంగా మూడు సిలిండర్లు ఇస్తామని వివరించారు. అనంతరం మహిళా నేతలను తెలుగు మహిళలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీకే లావణ్య, సీఎం విజయ, రాణి, వరలక్ష్మి, శ్రీదుర్గ, ఉదయ, రేవతి, అను, సుమతి, దీప, విక్టోరియ, శిల్ప, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

విజయానందరెడ్డిది నేర చరిత్ర : టీడీపీ


విజయబాబును సన్మానిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, మార్చి 8 : చిత్తూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డిది నేర చరిత్ర అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు ఆరోపించారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయానందరెడ్డి ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ వందల కోట్లు అక్రమంగా సంపాదిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్‌లలో విజయానందరెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. టీడీపీ- జనసేన ఉమ్మడి అభ్యర్థి గురజాల జగన్మోహన్ జీజేఎం ఫౌండేషన్ ద్వారా చిత్తూరు నియోజకవర్గంలోని బడుగు, బలహీన వర్గాల ప్రజలకు, విద్యార్థులకు, చిరు వ్యాపారులకు అనేక సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. అనంతరం నూతనంగా నియామకమైన పోతుగుంట విజయబాబును ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు సురేంద్రకుమార్, కోదండయాదవ్, కాజూరు బాలాజి, వెంకటేష్‌యాదవ్, బాలాజి, త్యాగరాజన్, అశోక్ పాల్గొన్నారు.

శివాలయాల్లో మార్మోగిన ఓంకారనాదం


అగస్తీశ్వరాలయంలో భక్తుల పూజలు

చిత్తూరు కల్చరల్, మార్చి 8: నగరవాసులు శుక్రవారం మహా శివరాత్రిని భక్తి ప్రపత్తులతో నిర్వహించుకున్నారు. శివాలయాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. నగరంలో అత్యంత ప్రాశస్త్యం పొందిన శ్రీ కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయంలో కాళభైరవ ట్రస్టు వ్యవస్థాపకులు టి. వెంకటేషన్ ఆధ్వర్యంలో అభిషేకాలు జరిగాయి. గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వరాలయంలో శివరాత్రి లింగోద్భవ పూజలు చేశారు. ఇరువారం నాగేంద్ర స్వామి, కట్టమంచి కులందేశ్వర, రంగాచారి వీధి కాశి విశ్వేశరాలయాల్లో అభిషేకాలు జరిగాయి. స్థానిక నీవా నదితో పాటు , యన్టీఆర్ జలాశయం, గిరింపేట గంగినేని, కట్టమంచి, తిమ్మసానిపల్లె చెరువుల్లో భక్తులు మాఘస్నానాలు ఆచరించారు. ● గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో సాయిలింగేశ్వర స్వామికి రుద్రాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సత్యనారయణ, కంతయ్య, పాండురంగం, గజేంద్ర రెడ్డి, నగర కన్వీనర్ శేషనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తపోవనంలో : టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, హరికథ నిర్వహించారు.

బ్రహ్మకుమారీస్ : ప్రజాపిత ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో సాంబయ్య కండ్రిగ జ్యోతిరెడ్డి నగర్‌లో అమర్నాథ్ హిమ సైకత లింగ ప్రదర్శనకు భక్తులు భారీగా తరలివచ్చారు. అలాగే కట్టమంచి, పగడమానువీధుల్లో బ్రహ్మకుమారీస్ నిర్వహకులు ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగాల ప్రదర్శనకు భక్తులు విశేషంగా తరలివచ్చారు.

వైభవంగా రుద్రాభిషేకం

పెనుమూరు, మార్చి 8: పెనుమూరులోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈశ్వర్‌ప్రసాద్ కుటుంబ సభ్యులు నిర్వహించిన రుద్రహోమం కార్యక్రమానికి మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి దంపతులు హాజరయ్యారు. అనంతరం టీడీపీ నాయకులు మనోహర్‌రెడ్డి, క్రిష్ణమూర్తి నాయుడు ఇంటికి వెళ్లారు. వారికి పసుపుకుంకుమ నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్యానాయుడు, హరిబాబునాయుడు, తలారి రెడ్డెప్ప, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ● పులిగుండు శివాలయంలో ఉదయమే స్వామి వారికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం కల్యాణోత్సవం చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. డీఎల్ఎస్ఏ సెక్రటరీ సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు, వారికి ఆలయ ధర్మకర్త షణ్ముగరెడ్డి, కేశవులురెడ్డి తీర్థప్రసాదాలు అందజేశారు.


అమర్‌నాథరెడ్డి ఆశీర్వదించిన అర్చకులు

రాజకీయాల్లో రాణిస్తున్న మహిళలు

చిత్తూరు రూరల్, మార్చి 8: మహిళలు అన్ని రంగాలతో పాటు రాజకీయాల్లోనూ రాణిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక గాంధీరోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.మహిళా నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం వారిని నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విక్టోరియా, రాణి, పూర్ణచంద్ర, చందురాణి, లలిత, చందన, పరదేశి, మణిక్రిష్ణ, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ లేకపోతే గమనం లేదు: ఏఎస్పీ


మహిళలతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఏఎస్పీ అరీఫుల్లా

చిత్తూరు, మార్చి 8: సమాజంలో స్త్రీ లేకపోతే గమనం, జననం, జీవం, సృష్టి లేదని ఏఎస్పీ అరీఫుల్లా అన్నారు. శుక్రవారం ఏఆర్ పోలీసు కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి 35 సంవత్సరాలు పైబడిన వంద మంది మహిళలకు వివిధ రకాల వైద్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం మహిళలచే కేక్‌కట్ చేసి అభినందలు తెలిపారు. వైద్య శిబిరంలో పాల్గొన్న అపోలో వైద్య సిబ్బందిని ఆయన సత్కరించారు. ఈ కార్యక్రమంలో దిశ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ మహబూబ్‌బాషా, ఆర్ఐ నీలకంఠేశ్వర్‌రెడ్డి, సీఐలు విశ్వనాథరెడ్డి, ఉలసయ్య, రవిశంకర్‌రెడ్డి, కుల్లాయప్ప, లక్ష్మణన్, మనోహర్, బాలయ్య పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి


పురస్కారాలు అందుకున్న మహిళామణులు

చిత్తూరు కల్చరల్, మార్చి 8: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే సమాజం అభివృద్ధి చెందుతుందని విజయం విద్యా సంస్థల అధినేత్రి శైలజామూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ గెస్ట్‌హౌస్ లో నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవం నిర్వహించారు. అనంతరం అపోలో యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫసర్ హిమబిందు, సంగీత ఉపాధ్యాయురాలు శ్యామల, రచయిత్రి అరుణకుమారి, విజయం విద్యాసంస్థల అధినేత్రి శైలజామూర్తిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రచయిత్రి కట్టమంచి క్రిష్ణవేణి, మిట్టాలక్ష్మి, రచయితలు హరినాయుడు, రమేస్, క్రిష్ణంరాజు, నిర్వాహకురాలు కరణం విమల, సాహితివేత్తలు, కళాకారులు పాల్గొన్నారు.

మహిళా మణులకు సన్మానం



చిత్తూరు రూరల్, మార్చి 8: చిత్తూరులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంతపేటలోని మాతృసేవా సమితి నిత్య అన్నదాన ఆశ్రమంలో ప్రతిరోజూ వృద్ధులకు భోజనం వడ్డించే ఆశ్రమంలోని దేవి, పూజలను మాజీ కౌన్సిలర్ పార్థసారథినాయుడు సన్మానించారు.

అమ్మఒడి ఆధ్వర్యంలో...

అమ్మఒడి ట్రస్ట్ ఆధ్వర్యంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో నిత్య అన్నదాన కార్యక్రమంలో పనిచేసే మహిళను, ట్రస్ట్ సభ్యులైన మహి ళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అమ్మఒడి నిర్వాహకుడు పద్మనాభనాయుడు, సభ్యులు మల్లి, ప్రభాకర్, ప్రకాష్, లత తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంతో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

● డాక్టర్ థామస్, పొన్నా యుగంధర్

గంగాధరనెల్లూరు, మార్చి 8: డిప్యూటీ సీఎం పదవితో నారాయణస్వామి కుటుంబానికి తప్ప నియోజకవర్గ ప్రజలకు ఒరిగిందేమీ లేదని గంగాధరనెల్లూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ ధ్వజమెత్తారు. బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ, టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలపై కొట్రకోన పంచాయతీలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ పొన్న యుగంధర్‌తో కలిసి ప్రచారం చేశారు. అనంతరం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. డాక్టర్ థామస్ మాట్లాడుతూ నారాయణస్వామి పుత్తూరులో స్విమ్మింగ్ పూల్‌తో ఇల్లు, తిరుపతి, బెంగళూరు,హైదరాబాద్, చెన్నైలో ఆస్తులు కూడబెట్టుకున్నారే గానీ ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. వైసీపీలో ప్రస్తుతం ఎమ్మెల్యే అభ్యర్థినిని ప్రచారంలో ఉన్న కృపాలక్ష్మి కలెక్షన్ రాణిగా పేరు తెచ్చుకున్నారని తెలియజేశారు. తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. పొన్న యుగంధర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో థామస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, వెంకటేష్, శ్రీధర్‌యాదవ్, స్వామిదాస్, దేవసుందరం, జనసేన నేతలు జయపాల్ రాజు, గుణ, యువరాజు, కిరణ్, శోభన్, రాఘవ, సురేష్, రుద్ర, నరేష్, బానుప్రసాద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వలసలు

కొట్రకోన పంచాయతీ గారంపల్లెలో నియోజకవర్గ తెలుగుయువత ఉపాధ్యక్షుడు ప్రసాద్‌నాయుడు, టీడీపీ నేతలు నరసింహులునాయుడు, చంద్రబాబుగౌడ్‌ల ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన కొట్రకోన మాజీ సర్పంచ్ మహదేవన్‌తో పాటు వైసీపీ కార్యకర్తలు క్రిష్ణబాబు, యోగేష్, నందకుమార్ గౌడ్, ప్రభాకర్‌యాదవ్, ప్రసాద్‌యాదవ్, ఏకాంబరయాదవ్, నారాయణ, శ్రీనివాసయాదవ్, వైభవ్, రాజుగౌడ్, మురళి, హరిబాబు టీడీపీలో చేరారు. డాక్టర్ థామస్ వారిని పార్టీలోకి ఆహ్వానించారు. జనసేన ఇన్‌చార్జ్ పొన్న యుగంధర్, టీడీపీ నాయకులు దీపక్‌నాయుడు, సునీల్‌నాయుడు, లాయర్ శరవణకుమార్ పాల్గొన్నారు.


థామస్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీకి చెందిన మాజీ సర్పంచ్, బీసీ నేతలు

భక్తులతో పోటెత్తిన శివాలయాలు

తవణంపల్లె, మార్చి 8: మండలంలో శుక్రవారం మహాశివరాత్రిని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. శివాలయాలు శివనామ స్మరణతో హోరెత్తాయి. అరగొండ స్వయంభువ నేశ్వర ఆలయం, తవణం పల్లె కాలభైరేశ్వరస్వామి ఆలయం, కంపల ఎల్లె గ్రామం వద్ద గల సిద్ధేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తవణంపల్లె కాలభైరేశ్వరస్వామి ఆలయంలో శివమాల భక్తులు ఇరు ముడి చెల్లించారు. లక్ష బిల్వార్చన పూజ చేశారు. సాయం త్రం స్వామివారిని భైరవవాహనంపై ఊరేగించారు. అర్ధగిరి వీరాంజ నేయ స్వామి ఆలయం తరపున కాలభైరేశ్వరస్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు.


కార్వేటినగరంలో నంది వాహనంపై సదాశివేశ్వరుడు, జీడీ నెల్లూరు మండలం కొట్రకోనలో విశేష అలంకరణలో మల్లేశ్వరస్వామి

విజయపురం: మండలంలోని గంగమాంబపురంలో నందీశ్వరుడికి అభిషేకం నిర్వహించారు. పన్నూరులో ఆనందవల్లీ ఇష్టకామేశ్వరస్వామికి విశేషపూజలు చేశారు. చెంగమనాయుడు కండ్రిగలో సహస్రలింగేశ్వరుడికి లక్షబిల్వార్చన నిర్వహించారు. జగన్నాథపురంలో శ్రీరామనామ క్షేత్రంలో పూజలు నిర్వహించారు. ఆలపాకంలో శివపార్వతులను ఊరేగించారు. అన్నదానం చేశారు.

గంగాధరనెల్లూరు: మండలంలోని కొట్రకోన మల్లేశ్వరస్వామి, గంగాధరనెల్లూరులోని గంగాధరేశ్వర స్వామి, వేల్కూరులో శివాలయంలో, వెజ్జుపల్లెలో ఆవుదేవర నందీశ్వర శక్తి ఆలయంలో, సిద్దేశ్వరకొండలో ప్రసన్న పార్వతి సమేత సిద్దేశ్వరస్వామి ఆలయంలో, మహాదేవమంగళంలో మహాదేశ్వర స్వామి శివాలయాల్లో విశేష పూజలు చేశారు. కొట్రకోన మల్లేశ్వరస్వామిని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ దర్శించుకున్నారు.

పెనుమూరు: రామాపురం శివాలయంలో చండీయాగం, కళ్యాణోత్సవం, అన్నదానం చేశారు. కావూరివారిపల్లి వద్ద గల పార్వతీ పరమేశ్వర రుణవిమోచన దేవాలయంలో సాయంత్రం హరికథను ఆలపించారు. విజయ్ కుమార్‌రెడ్డి దంపతులు అన్నదానానికి రూ.10 వేలు విరాళం అందించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, సర్పంచ్ నవీన్‌రెడ్డి, కురుణాకర్‌లు పాల్గొన్నారు. కేసీపల్లి, అట్లవారిపల్లి, కలవగుంట, వేయిలింగాలు, కాచేరిగుట్ట ఆలయాల్లో పూజలు వేడుకలు నిర్వహించారు.

పాలసముద్రం: రాచపాళ్యంలోని బాలగురునాదీశ్వర ఆలయంలో, శ్రీకావేరిరాజుపురం పంచాయతీలోని పాలకొండ శివాలయంలో విశేష పూజలు చేశారు. రాత్రి జాగారం చేయడానికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పూతలపట్టు: పూతలపట్టు భీమేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి శివలింగానికి పలు అభిషేకాలు చేశారు.

కార్వేటినగరం: టీటీడీ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. అలాగే సదాశివేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని వెండి నంది వాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కొండూరు మోహన్‌రాజు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


తవణంపల్లె కాలభైరేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చనలో పాల్గొన్న భక్తులు

● స్థానిక కాశీవిశ్వనాథ స్వామి ఆలయంలో, ఉమాతంగమేశ్వర ఆలయంలో విశేష పూజలు చేశారు.

నింద్ర: మండలంలోని అన్ని శివాలయాల్లో శివరాత్రి ఘనంగా జరిగింది. ఉదయం ప్రత్యేక పూజలు అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. నింద్రలో కొలువైన భిక్షాటేశ్వర స్వామి ఆలయంలో ఉభయదారులు టైల్‌రాజు రంగరాజు వంశీయులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు నందీశ్వర, సుబ్రమణ్యం స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించాను.

నగరి: నగరి పట్టణ పరిధిలో వెలసిన కామాక్షి సమేత కరకంఠేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రదోషపూజలు వైభవంగా నిర్వహించారు. మహిళా భక్తులు అధికసంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.